క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

డోన్: పట్టణంలోని పాతపేటలో వెలసిన ద్రోణపురి వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మాలధారులు స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

15 వరకు పంటల బీమా నమోదుకు గడువు


మినుము, శనగ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల బీమాకు ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం మండలంలోని కంపమల్ల, భీమునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము, జొన్న, పప్పుశనగ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. శనగ, జొన్న, మినుము, తదితర పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం సంభవిస్తే ఆయా పంటలకు బీమా వర్తిస్తుందని సూచించారు. మీసేవా, రైతు సేవాకేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. పశువైద్యాధికారి కృష్ణకుమార్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


32వ వార్డులో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: పట్టణంలోని పలు సీసీరోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంగళవారం స్థానిక 32వ వార్డులో రూ.5 లక్షలతో చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులను మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్ వంశీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు రోడ్లను మంచినీటి కుళాయి పైప్‌లైన్ల ఏర్పాటు కోసం ధ్వంసం చేశారని..వాటికి మరమ్మతు పనులను చేస్తున్నామన్నారు. ఏఈ సురేష్, సచివాలయ ఉద్యోగి నవీన్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో వెంకటాపురం, ఎల్‌బండ ఫీడర్లకు సంబంధించి 11 కేవీ లైన్ మార్పు పనుల కారణంగా బుధవారం కూడా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అబ్బిరెడ్డిపల్లె, బొంతిరాళ్ల, వెంకటాపురం, గుమ్మకొండ, ఉడుములపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాలకు త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి 2 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన ఓ రైతు మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. కోవెలకుంట్లకు చెందిన ఆంజనేయులు అనే రైతు పొలంలో గడ్డి కోస్తుండగా గడ్డిపొదల్లో దాగి ఉన్న పాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్: స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంఘం, రక్షణ సంఘాల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, నాగరాజు డీఎస్పీని సన్మానించి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. మేలుకొలుపు పుస్తకాలను డీఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

పల్లెల్లో నాటు.. ఘాటు

- యథేచ్ఛగా నాటుసారా అమ్మకాలు
- అధికార పార్టీ నాయకుల అండగా రెచ్చిపోతున్న వ్యాపారులు
- గ్రామాల్లో ఎక్కడ చూసినా సారా ప్యాకెట్ల దర్శనం
- నామమాత్రంగా దాడులు



కొలిమిగుండ్లలో తాగిపడేసిన సారా ప్యాకెట్లు, పట్టుబడిన నాటుసారా ప్యాకెట్లతో ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

కొలిమిగుండ్ల: పల్లెల్లో మంచినీళ్ల కంటే నాటుసారా పుష్కలంగా దొరుకుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటుసారా అమ్మకాలు జోరందుకున్నాయి. ఆ పార్టీ నాయకుల అండతో ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఫోన్ కొడితే చాలు క్షణాల్లో నాటు సారా ప్యాకెట్లను డోర్ డెలివరీ చేస్తున్నారు. పట్టపగలే జనావాసాల మధ్యనే నాటుసారా యథేచ్ఛగా అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో గ్రామాల్లో తక్కువగా సారా అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం పోటాపోటీగా సారా వ్యాపారం సాగిస్తున్నారు. ఒక్కో ఊర్లో రెండు మూడు చోట్ల సారా విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. బనగానపల్లె ఎక్సైజ్ శాఖ పరిధిలో కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాలు వస్తాయి. సెబ్ వ్యవస్థ నుంచి ఎక్సైజ్‌గా మార్పు చెందాక సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు 72 కేసులు నమోదయ్యాయి. మొత్తం 38 మంది విక్రేతలను అరెస్ట్ చేశారు. కోవెలకుంట్ల, సంజామల మండలాల పరిధిలో దాడులు, కేసులు చాలా తక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బెల్లం తయారీకి అవసరమైన బెల్లం యథేచ్ఛగా రవాణా అవుతోంది. అవుకు మండలంలో పెద్ద ఎత్తున నాటు సారా తయారీ జరుగుతోంది. అక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

దాడులు చేసినా ఆగని జోరు

ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు సారా తయారీదారులు, విక్రేతలపై అడపదడపా దాడులు చేస్తున్నా పల్లెల్లో సారా జోరు తగ్గడం లేదు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నా వారం రోజుల వ్యవధిలో బయటకు వచ్చి మళ్లీ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన అనుమాయలు సారా అమ్మకాలు చేస్తున్నా వాళ్లపై దాడులు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిగిలిన వారిపై తూతూ మంత్రంగా దాడి చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో నాటుసారాకు బానిసలుగా మారారు. రోడ్ల వెంట, పొలాలు, గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడే నాటుసారా సేవిస్తున్నారు. దీంతో ఖాళీ ప్యాకెట్లు ఎక్కడ చూసినా కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో జోరుగా సాగుతున్న నాటు సారాపై బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవిని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

భూసార పరీక్షలతో ఉత్తమ ఫలితాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

డోన్ టౌన్: రైతులు కంది పంటల కోతల అనంతరం భూసార పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా మందులు వాడితే పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తకోట, కొత్రాయి రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలని సూచించారు. దీని వల్ల చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. రబీలో శనగ, మినుములు, జొన్నలు, ఉల్లి, వరి పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన పంటలు, పట్టు పరుగుల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని ఆయా శాఖల అధికారులు కల్యాణి, ప్రసాద్‌రావు అన్నారు. కొత్తకోట సర్పంచ్ చంద్రన్న, ఎంపీటీసీ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం


విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న సీఐ, ఎంఈఓ, రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజంలో రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ధరణి టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల విలువచేసే సైకిళ్లను అందజేశారు. సీఐ, ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాతల తోడ్పాటును వృథా కానివ్వకుండా విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలు ఎప్పుడైనా ఇబ్బందికర పరిస్థితిలో ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హెచ్‌ఎం అబ్రహం, పీఈటీ రంగనాయకులు, క్లబ్ సభ్యులు విజయనాగరాజు, ప్రేమ్ స్వరూప్, రామ్మూర్తి, శ్రీధర్,సత్తార్, మాణిక్యం, అక్తాబ్, మగ్బుల్ పాల్గొన్నారు.

సంచార చికిత్సపై అవగాహన కల్పించాలి


సేవల గురించి ఆరా తీస్తున్న జిల్లా అధికారి

ప్యాపిలి: గ్రామాల్లో నిర్వహించే సంచార వైద్యచికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆ శాఖ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మూడో సచివాలయంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. పనితీరును స్థానిక వైద్యాధికారి నితీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ తదితర వైద్య పరీక్షలను వేగవంతం చేయాలన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ శాతాన్ని పెంచాలన్నారు. సంచార సేవల గురించి ఆశావర్కర్లు ఒక రోజు ముందే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఓపీని పెంచాలన్నారు.

రాజీమార్గంతో కేసులకు సత్వర పరిష్కారం


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్

కోవెలకుంట్ల: రాజీమార్గం ద్వారా దీర్ఘకాలిక కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. ఇందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం స్థానిక కోర్టులో కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో అన్ని కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఈ నెల 14వ తేదీ అన్ని కోర్టుల్లో జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సీఐలు హనుమంతునాయక్, రమేష్‌కుమార్, ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న రైతు

ప్యాపిలి: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని పోతుదొడ్డి గ్రామస్తులు తహసీల్దార్ భారతిని కోరారు. గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ పొలాలు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. అలాగే గ్రామానికి చెందిన రంగమ్మ, నారాయణ, కదిరప్ప తదితరులు తమ గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక ఆక్రమణకు గురై కేవలం 5 సెంట్లు మాత్రమే మిగిలి ఉందన్నారు. దీంతో మృతదేహాలను పూడ్చిపెట్టాలంటే పాత సమాధులను తవ్వాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 2 వేల జనాభా ఉన్న గ్రామానికి తగ్గట్లు కొత్తగా శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన అల్లాబకాష్, హాజీవలి, నూర్‌వలి తదితరులు ముస్లిం శ్మశానవాటికకు ప్రహరీగోడ ఏర్పాటు చేయాలని కోరారు.

అఘాయిత్యాలను అరికట్టడంతో ప్రభుత్వం విఫలం

డోన్ టౌన్: సమాజంలో బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షమీంబేగం అన్నారు. స్థానిక నక్కి రామన్న భవనలో మంగళవారం ఆమె మాట్లాడారు. వెల్దుర్తిలో ప్రేమోన్మాది చేతిలో ప్రాణాలు కోల్పోయిన బాలిక కుటుంబానికి తగిన న్యాయం చేయాలన్నారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మహిళా సమాఖ్య మండల కార్యదర్శి అమృతారెడ్డి, లక్ష్మీదేవి, శిరీన్ ఉన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ



కొలిమిగుండ్ల: శిక్షణ ఇస్తున్న సుధాకర్‌గుప్త, సంజామల: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ, ఐకేపీ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ రోజారమణి, సీడీపీఓ పద్మావతి హాజరయ్యారు. ట్రైనర్స్ సుధాకర్‌గుప్త, రామకృష్ణారెడ్డి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని చెప్పారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకునేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్లు చెప్పారు. 11–18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు.

సంజామల: కిశోర బాలికలు ఆత్మస్థైర్యంగా ఉండాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధిక, ఎంఈఓ ఈశ్వరయ్య, ఏపీఎం గురుస్వామి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: బాలికా విద్యను ప్రోత్సహించాలని ఎంపీడీఓ వరప్రసాదరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్య, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ, వెలుగు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలను మధ్యలోనే బడి మాన్పించి చిన్న వయసులోనే వివాహాలు జరిపిస్తున్నారన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని వివరించారు. ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి,వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని పోస్టర్లను విడుదల చేశారు. బాలికల విద్యను ప్రోత్సాహించాలన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే విలువలు నేర్పించడంతో పాటు బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.


కోవెలకుంట్లలో..

అవుకు: బాలికల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. డ్రాప్ అవుట్ విద్యార్థినులు తిరిగి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీఓ వెంగన్న, హెల్త్ ఆఫీసర్ యమునా, ఎంఈఓలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. మండలంలోని చెరువుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో లింగ వివక్ష, బాలిక విద్యపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు గ్రామోత్సవం


మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు

బేతంచెర్ల: గీతా జయంతి సందర్భంగా శ్రీకృష్ణ భగవానునికి బుధవారం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌలీశ్వర్‌రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ నాగమోహన్ తెలిపారు. మంగళవారం నంద్యాల రహదారిలోని గోపాలకృష్ణ బృందావనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామోత్సవానికి హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అధ్యాపకునిపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: పరీక్షా కేంద్రంలో విధులు సక్రమంగా నిర్వహించకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడిన అధ్యాపకుడు మోహన్‌నాయక్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో కొద్ది రోజుల నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. డోన్‌లోని గుండా వెంకటరత్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సెమిస్టర్ పరీక్షకు ఇన్విజిలేటర్‌గా ఉన్న మోహన్‌నాయక్ పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లి మొబైల్ మాట్లాడుతూ విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడే విధంగా ప్రవర్తించారని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మందలించగా ఆమెను దూషించడం దారుణమన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం


బేతంచెర్ల: హెచ్‌కొట్టాల గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

డోన్ టౌన్: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నాగమణి అన్నారు. మంగళవారం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మస్తానయ్య, వీఆర్వోలు వెంకట్రాముడు, మాధవస్వామి, మండల సర్వేయర్ జగదీష్ పాల్గొన్నారు. కాగా మండలంలోని చిన్నమల్కాపురం, కమాలపురం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

బేతంచెర్ల: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు కోరారు. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలోని 22 మంది రైతులు భూసమస్యలపై అర్జీలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ అనీల్ కుమార్ 13 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని విచారించి 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ తెలిపారు. డీటీ తులసి కృష్ణ, సర్వేయర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆకుమల్లలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

రెవెన్యూ సదస్సుకు కొరవడిన స్పందన

కొలిమిగుండ్ల: భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి స్పందన కొరవడుతోంది. మంగళవారం నందిపాడులో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుర్విరెడ్డి పాల్గొన్నారు. సదస్సుల ముఖ్య ఉద్దేశంపై తహసీల్దార్ రైతులకు అవగాహన కల్పించారు. 20 మంది కంటే మించి రైతులు హాజరుకాలేదు. కొంత మంది వచ్చి కాసేపు కూర్చొని తిరుగుముఖం పట్టారు. కొంత మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు.

డోన్ కొండకు కొత్త శోభ

- రూ.40లక్షల వ్యయంతో కల్యాణ మండపం
- 40 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు


కొండపై వెలసిన వీరాంజనేయస్వామి


ద్రోణాచారుని విగ్రహం


కొండపై నిర్మించిన కల్యాణ మండపం, 40 అడుగుల స్వామి విగ్రహం

డోన్: ఒకప్పుడు ద్రోణపురిగా పిలవబడే ద్రోణాచలం నేడు కొత్త రూపును సంతరించుకుంది. ద్రోణుడు, అచలం(కొండపై) తపస్సు చేసినందు వల్లే ఈ ప్రాంతానికి ద్రోణాచలం అనే పేరు వచ్చిందని పూర్వీకులు చెబుతుంటారు. పట్టణానికి దక్షిణ భాగాన ఎత్తయిన కొండపై కొలువైన మూడు మతాలకు చెందిన దేవుళ్లు వెలసినందు వల్ల మతసామరస్యానికి అండ మన డోన్ కొండ అంటూ ఈ ప్రాంతం వాసులు సగర్వంగా చెప్పుకుంటారు. హిందువులకు ఆరాధ్య దేవుడైన ఆంజనేయస్వామి, ముస్లింలకు మౌలాలి స్వామి, క్రిస్టియన్లకు చర్చి ఒకే కొండపై ఉన్నందు వల్ల శుక్ర, శని, ఆదివారాలు కొండకు వేలాది మంది భక్తులు వచ్చి ఇష్ట దైవాలకు పూజలు చేస్తుంటారు. ప్రస్తుతం ఈ కొండపైనే తమ్మరాజుపల్లె నుంచి డోన్ మండలంలోని యు కొత్తపల్లె వరకు రూ.700కోట్లతో జాతీయ రహదారిని నిర్మిస్తుండడంతో ఈ కొండ పర్యాటక కేంద్రంగా విరాజిల్లే అవకాశం ఉంది.

ఆకర్షిస్తున్న గిరిప్రదక్షిణ రహదారి

వీరాంజనేయస్వామి ఆలయం వద్ద రూ.40 లక్షలతో మాణిక్య ప్రభు సేవాసమితి అన్ని హంగులతో కల్యాణ మండపం నిర్మించింది. దాతలు 40 అడుగుల ఎత్తు గల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలకు నేనున్నాననే విధంగా పై నుంచి అభయం ఇస్తున్నట్లుగా ఏర్పాటు చేసిన విగ్రహం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇటీవల మాణిక్యప్రభు సేవాసమితి, దాతల సహకారంతో గుడిచుట్టూ కొండపై గిరిప్రదక్షిణ కోసం ఏర్పాటు చేసిన రహదారి మరింత ఆకర్షణీయంగా మారింది. దీంతో శనివారంతో పాటు మిగతా రోజుల్లో కూడా కొండను సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ప్రకృతి అందాలను సేదతీరేందుకు భక్తులకు అవకాశం ఏర్పడింది.

మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ

బేతంచెర్ల: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు తమవంతు తోడ్పాటు అందిస్తామని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో కుమార్తె చిత్రమ్మతో కలిసి మహిళలతో సమావేశం నిర్వహించారు. స్వయం ఉపాధిలో రాణించడానికి శిక్షణతో పాటు బ్యాంకుల ద్వారా రుణం అందేలా కృషి చేస్తామన్నారు. పేపర్ ప్లేట్లు, కొవ్వొత్తుల తయారీ, జూట్ బ్యాగులు, అగరబత్తీల తయారీతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.